# కథా సూచిక


1. క్రాస్ రోడ్స్ ........ 1
2. పొగమంచు ........ 14
3. తాంత్రిక్ ఈవెనింగ్........ 26
4. తుషార బిందువులు ........ 42
5. లాస్ట్ ట్రిప్........ 56
6. అశ్వమేధం ........ 77
7. కథ కానిది ........ 87
8. చలిమంటలు........ 95
9. పద్మక్క పెళ్లి అను రాజా చెప్పిన కథ ........ 115
10. యులిసిస్ వచ్చినరోజు ........ 129
11. లిక్కర్ లెసన్ అను మందు పాఠం ........ 147

# క్రాస్ రోడ్స్

**ట**పాలో వచ్చిన ఉత్తరాల్లో ఆ కవర్ ప్రత్యేకంగా కనబడింది. తీసి చూశాను.

న్యూయార్క్ పోస్ట్‌మార్క్ ఉంది. ఫ్రమ్ అడ్రస్, డయానా కార్పొరేషన్, న్యూయార్క్ అని ఉంది.

కవర్ చించి అందులోని కాగితాల్ని తీశాను, ఆరు పేజీల ఉత్తరం. పేజీల మధ్యనుండి ఓ కలర్ ఫోటోగ్రాఫ్ కింద పడింది. ఫోటోలో ఓ జంట నవ్వుతూ ఉంది. 'ఫార్చూన్' మాగజైన్ పేజీల్లోనూ, 'బిజినెస్ వీక్' కవర్ పేజీల మీదా కనిపించే ఎగ్జిక్యూటివ్ టైప్ వ్యక్తి. డార్క్ సూట్.... రెడ్ టై... నవ్వుతున్నాడు.

అతణ్ణి నేనెక్కడో చూసినట్లుగా అనిపించింది. అతడి నడుం చుట్టూ చేయి వేసి ఓ నీలం కళ్ళ బ్లాండ్ పిల్ల మెరుస్తున్న పళ్ళన్నీ కనబడేలా హాపీగా నవ్వుతోంది. ఆ పిల్ల మెడని ముత్యాల హారం మృదువుగా కౌగలించుకుంటోంది.

బలంగా ఆరోగ్యంగా వున్న ఆ జంట ఆనందంతో వెలిగిపోతున్నారు. వాళ్ళ చేతుల్లో బొద్దుగా బొమ్మలా ముద్దుగా వున్న పసివాడు నీలం కళ్ళు పెద్దవి చేస్తూ కెమెరా వంక చూస్తున్నాడు.

ఎవరు వీళ్లు?

బహుశా ఎవరికో వచ్చిన ఉత్తరాన్ని నేను ఓపెన్ చేయలేదు గదా! మళ్ళీ చూశాను. కవర్ మీద డాక్టర్ శశిధర్ సూపర్నెంట్ ఆఫ్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్, అని వుంది.

లెటర్ మీద అడ్రెస్ ఇలా వుంది.

మాక్స్ బ్రాండన్

వైస్ ప్రెసిడెంట్

డయానా కార్పొరేషన్

ఆ పేరు ఎక్కడో విన్నాను. ఆ వ్యక్తిని ఎక్కడో చూశానేమో. నా ముప్ఫై నాలుగేళ్ళ సర్వీస్‌లో ఎన్నో వేలమంది రోగులకి ట్రీట్‌మెంట్ ఇచ్చాను. మరి కొద్ది నెలల్లో రిటైర్ కాబోతున్న డాక్టర్ని.

స్టీరియో మీద బేగం అక్తర్ గజల్స్ పాడుతోంది.

మాక్స్... మాక్స్... హు ది హెల్ ఈజ్ దిస్ మాక్స్?

"డియర్ డాక్టర్ శశిధర్,

నన్ను మరిచిపోయి ఉంటారనుకుంటున్నాను. నేను ఇండియాలో..."

చప్పున జ్ఞాపకం వచ్చింది.

మైగాడ్! పదహారేళ్ళ క్రితం జరిగిన సంఘటన కళ్ళముందు తిరిగింది. ఆనాడు...

సాయంత్రం చీకట్లు కమ్ముకుంటున్న సమయంలో నేను బంగళా బయట లాన్‌లో నడుస్తున్నాను. పక్కనే బ్రూసీ తోకాడించుకుంటూ నా వెనకే తిరుగుతోంది.

దీపిక వంటింట్లో పురమాయిస్తూ రాత్రి భోజనానికి ఏర్పాట్లు చేస్తోంది.

అక్టోబర్ సాయంత్రం... కొద్దిగా చలిగా ప్లెజెంట్‌గా ఉంది. విరగబూసిన గులాబీల పరిమళం గాలిలో కలిసి మత్తెక్కిస్తోంది. చివరి వరకూ కాలిన సిగరెట్‌ని గులాబీ పొదల్లోకి విసిరి కుర్చీలో కూర్చోబోతుండగా ఓ జీప్ వచ్చి ఆగింది. అందులో నుండి టౌన్ ఇన్‌స్పెక్టర్ రమణారావు దిగాడు.

నన్ను చూసి సెల్యూట్ చేశాడు.

"వాట్ రమణారావ్ ఏమిటి సంగతి?" అన్నాను.

"డాక్టర్ మీకో కేసు."

నవ్వాను.

"ఏ కేసు? మరో హిట్ అండ్ రన్ కాదు కదా కొంపదీసి?"

"నో! మీరే చూడండి"అన్నాడు జీప్ వంకకు చూపిస్తూ.

"ఏం జరిగింది?"

"రాంపూర్ గ్రామం బయట రోడ్డుమీద పడి ఉంటే గ్రామస్థులు ఫిర్యాదు చేస్తే వెళ్ళి జీప్‌లో తీసుకు వచ్చాం డాక్టర్. ఎలాగూ మీ బంగళా దారిలోనే కదాని ఇలా వచ్చాను. చెప్పి హాస్పిటల్‌కి తీసుకుపోదామని."

ఇద్దరు కానిస్టేబుల్స్ ఆసరాతో ఒకణ్ణి దాదాపు సగం ఈడుస్తూ సగం మోస్తూ వస్తున్నారు. అతడి వంటిమీద జుగుప్సాకరమైన మురికి గుడ్డలు. లాల్చీ బాగా చిరిగిపోయి ఉంది. పైజామా చీలికలయి నల్లటి బురద మరకలతో వుంది. అన్నిటినీ మించిన భయంకరమైన దుర్వాసన అంత దూరంనుండే ముక్కులు బద్దలు కొడుతోంది.

ఆ వ్యక్తి ముఖంకేసి చూశాను. ఎవడో ఫారినర్! సంజె చీకటిలో ఏదీ స్పష్టంగా కనబడడం లేదు. పొడుగాటి జుట్టు మురికిగా జడలు జడలుగా భుజాల మీదికి సాగి వుంది. మీసాలు